క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



అయిజ: వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లో ఈనెల 16న నిర్వహించనున్న అలంపూర్ ఆత్మగౌరవ సభకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం పట్టణంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా అలంపూర్ నియోజకవర్గ సమన్వయకర్త క్రాంతిదళ్ నాగేష్ మాట్లాడుతూ ఆత్మగౌరవ సభకు క్రాతిదళ్ వ్యవస్థాపకుడు సంగంరెడ్డి పృథ్వీరాజ్, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీరేష్, రవి, కిశోర్, దొడ్డన్న, రాముడు, రవి పాల్గొన్నారు.

శ్రీరాంరెడ్డికి ఘననివాళి



రాజోళి: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు శ్రీరాంరెడ్డి అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. ఆయన పార్థివదేహానికి ఎమ్మెల్యే అబ్రహం, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీ మందా జగన్నాథం నివాళులర్పించారు. అంతిమ యాత్రలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పాల్గొని పాడె మోశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. శ్రీరాంరెడ్డి అంతిమ యాత్రలో అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

మల్దకల్: ఆరోగ్య సంరక్షణకు గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

18న రైతు భరోసా సభ

మానవపాడు: బీఎస్పీ ఆధ్వర్యంలో ఈనెల 18న మండల కేంద్రంలో రైతు భరోసా సభ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కేశవరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శాంతరాజు, రవి పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: మండలంలోని పుటాన్‌దొడ్డికి చెందిన ప్రేమ్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షుడు సురేష్‌బాబు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ప్రేమ్‌కుమార్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట తిరుపాల్, మధు, రవి, రాముడు, రవికుమార్ తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ హఠాన్మరణం



వెంకటేష్ (ఫైల్)

గద్వాల రూరల్: ధరూరు గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేష్ (23) శుక్రవారం హఠాన్మరణం చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన అనంతమ్మ కుమారుడు వెంకటేష్ కొన్నేళ్లుగా గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆరోగ్యం బాగోలేదని, ఛాతినొప్పి వస్తుందని స్థానిక ఆర్‌ఎంపీతో వైద్యం చేయించుకున్నాడు. రాత్రి 8గంటల సమయంలో అతడి పరిస్థితి విషమించడంతో గద్వాల ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి రోదనలు మిన్నంటాయి. చెత్త తరలించేందుకు నిత్యం కాలనీల్లో అక్కా.. చిన్నమ్మ.. బాబాయ్.. అన్నా అంటూ పలకరిస్తూ.. అందరిలో కలివిడిగా ఉండే వెంకటేష్ మృతిపై గ్రామస్తులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుడి తల్లి అనంతమ్మను సర్పంచ్ పద్మమ్మ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి, ధైర్యం చెప్పారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ఆత్మకూర్: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు స్థానిక గాంధీచౌక్‌లో, పరమేశ్వరస్వామి చెరువు వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా వాహనాల్లో నగదు తరలింపు, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియామవళి, ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో అలరించారు. బొడ్డెమ్మ ఆడుతూ బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. వేదనగర్‌లోని దయానంద విద్యామందిర్‌లో విద్యార్థులు బతుకమ్మ ఆడారు. ప్రిన్సిపాల్స్ సంపత్‌కుమార్, షేక్ కలేందర్ బాషా, అధ్యాపకులు సుకుమార్, శ్రీపతినాయుడు, లవీన మంజులత, పద్మ, శివారెడ్డి పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు. బతుకమ్మ పాటలతో పాఠశాలల ప్రాంగణాలు మార్మోగాయి. అనంతరం పట్టణ సమీపంలోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: మండలంలోని సరస్వతి పాఠశాలలో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీరొక్క పూలతో తొమ్మిది అడుగుల బతుకమ్మను తయారు చేసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బతుకమ్మ ఆడారు. నృత్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి అభినందించారు.



జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..



ఎర్రవల్లి చౌరస్తా ఏకశిల పాఠశాలలో..



అయిజ పట్టణంలో..

రైతును రాజు చేయడమే కేసీఆర్ లక్ష్యం



ధరూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల రూరల్: రైతును రాజు చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ధరూరు మండల కేంద్రంలో శుక్రవారం వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5లక్షల రైతుబీమా అందించి అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. పంట పెట్టుబడి సాయం అందించడంతోపాటు పండించిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాలతో ముందుకొస్తే.. మనం ఇప్పటికే 16 పథకాలను పూర్తిచేసి ప్రజల మనసులో చోటు సంపాదించుకున్నామన్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న బండ్ల జ్యోతి ప్రచార కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, డీఆర్ విజయకుమార్, శ్రీనివాస్ రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈశ్వరయ్య, మల్లికార్జున్‌రెడ్డి, భీంరెడ్డి, మహేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, అబ్రహం, సంజీవ్, వీరన్నగౌడ్ ఉన్నారు.

గట్టు: బీఆర్ఎస్‌తో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బండ్ల కుమారుడు సాయికేత్‌రెడ్డి అన్నారు. మిట్టదొడ్డి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, సర్పంచ్ నర్సింహులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

గద్వాల రూరల్: కేటీదొడ్డి మండలం కుచ్చినెర్ల గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే బండ్ల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, కృష్ణ, వెంకటేష్, ఆంజనేయులు, వీరన్న, గోపి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గట్టు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి పార్టీ కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేవైఎం నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని తెలిపారు. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, బల్గెర శివారెడ్డి, మధుసూదన్ రావు, రామకృష్ణ, భాస్కర్, రాజు పాల్గొన్నారు.



గట్టులో మాట్లాడుతున్న స్నిగ్ధారెడ్డి

జోగుళాంబదేవికి ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపురం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామిని శుక్రవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా సాదాసీదాగా ఆలయాలను దర్శించుకున్నారు.

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం షాబాద్‌కు చెందిన బోయ తిమ్మన్న అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పోతురాజు సోమనాద్రి సూచన మేరకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు లక్ష్మణ్‌గౌడ్, పీఆర్‌పీ, సాయిరాం, నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

గద్వాల రూరల్: ధరూరు మండల కేంద్రానికి చెందిన హనుమంతు కుమారుడు ఆంజనేయులు (25) అదృశ్యమైనట్లు హెడ్‌కానిస్టేబుల్ గుప్తా తెలిపారు. 20రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు అతడి కోసం వెతికినా ఫలితం లేకపోయిందని, హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

గద్వాల రూరల్: సర్వీస్ వైరు చోరీ విషయంలో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన ధరూరు మండలం ర్యాలంపాడులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రంగన్నతో సర్వీస్ వైరు చోరీ విషయంపై బుధవారం అతడి సోదరుడు నడిపి గోవిందు, ఆయన కుమారుడు రవి గొడవపడ్డారు. ఈ క్రమంలో రంగన్నపై దాడిచేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గుప్తా తెలిపారు.

మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లు

ఎర్రవల్లిచౌరస్తా: మానవపాడు మండలం చండూరుకు శుక్రవారం మద్యం తరలిస్తుండగా, దాడిచేసి పట్టుకున్నట్లు కోదండాపురం ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు. చండూరుకు చెందిన హుస్సేన్‌మియా జల్లాపురం స్టేజీ నుంచి సుమారు రూ.12వేల విలువజేసే మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా, పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

కంపు.. కంపు

- కోళ్ల వ్యర్థాలతో దుర్వాసన
- వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్న రైతులు
- అలంపూర్–రాయచూర్ రోడ్డుపై ముక్కు మూసుకుని ప్రయాణం
- కోళ్ల ఫారాల నిర్వహణపై చర్యలు శూన్యం

శాంతినగర్: వడ్డేపల్లి మండలం జూలెకల్ గ్రామశివారులో ముక్కుపుటాలు అదురుతున్నాయి. కోళ్ల ఫారాల నుంచి వెదజల్లే దుర్వాసనతో అక్కడి పరిసరాలన్నీ కంపు కొడుతున్నాయి. అలంపూర్–అయిజ ప్రధాన రహదారిపై ముక్కు మూసుకుని ప్రయాణించాల్సి వస్తోంది. ఒక చేత్తో ముక్కు మూసుకుని, మరో చేత్తో బండి నడపాల్సిన పరిస్థితి నెలకొంది. కోళ్ల ఫారాల సమీపంలోని పొలాల్లో రైతులు వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నారు. కోళ్ల ఫారాలతో దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకోలేమని రైతులు, కూలీలు చెబుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. కోళ్ల ఫారాల్లో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించకపోవడం, పరిశుభ్రత పాటించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని పేర్కొంటున్నారు. చనిపోయిన కోళ్లను కరెంట్ మెషిన్‌తో కాల్చినప్పుడు మరింత వాసన వస్తుందని రైతులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పొలాల్లో భోజనం కూడా చేయలేక ఉపవాసం ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు.

అనారోగ్యం బారిన ప్రజలు..

కోళ్ల ఫారాల వల్ల యాపదిన్నె, జూలెకల్, వెంకటాపురం, జూలెకల్ స్టేజీ ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. దుర్వాసనతో శ్వాసకోశ, నరాల బలహీనతకు సంబంధించిన వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. కోళ్ల వ్యర్థాల వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ, పొల్యూషన్ బోర్డు అధికారులు స్పందించి కోళ్ల ఫారాల యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జూలెకల్ గ్రామశివారులో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన కోళ్ల ఫారాలు

కూలీలు రావడంలేదు..



కోళ్ల ఫారాల నుంచి దుర్వాసన వెదజల్లుతుండటంతో వ్యవసాయ పనులకు కూలీలు రావడంలేదు. పొలాల్లో పంటసాగు పనులు చేయలేకపోతున్నాం. కంపును భరిస్తూ పంటలు ఎలా పండించుకోవాలో తెలియడంలేదు. కోళ్ల ఫారాల నుంచి దుర్వాసన వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలి.

– భాస్కర్, రైతు, యాపదిన్నె

అధికారులు స్పందించాలి..



జూలెకల్ గ్రామశివారులో ముక్కు మూసుకుని వెళ్తున్నాం. వాహనదారులు ఒక చేత్తో బండి నడుపుతూ.. మరో చేత్తో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంపు బారి నుంచి కాపాడాలి.

– వీరేష్, పచ్చర్ల

కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం

కేటీదొడ్డి/గట్టు: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాసంక్షేమం సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. కేటీదొడ్డి మండలంలోని ఎర్సందొడ్డి, సుల్తాన్‌పురం, గట్టు మండలం కొత్తపల్లి, మల్లంపల్లి గ్రామాల్లో శుక్రవారం తిరగబడదాం–తరిమికొడదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే ప్రతినెలా రూ.2,500 అందజేయడంతోపాటు రూ.500లకే గ్యాస్ సిలండర్, బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడంతో పాటు రైతు భరోసా పథకంతో ఎకరాకు రూ.15వేలు అందిస్తామన్నారు. సర్పంచ్ రాజు, ఎంపీటీసీ గీత, సింగిల్‌విండో డైరెక్టర్ సురేష్, కృష్ణారెడ్డి, మహానందిరెడ్డి, శ్రీనివాస్‌గౌడు, వెంకట్రామిరెడ్డి, మిల్లు వీరన్న, సత్యనారాయణ, వరలక్ష్మి, కృష్ణమూర్తి, వెంకటస్వామిగౌడ్, గౌస్, కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, మహబూబ్‌పాషా, రమేష్, గురుపాద, వసంత్, శివప్ప పాల్గొన్నారు.



సుల్తాన్‌పురంలో గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు

రాజోళి: రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు ఉంటాయని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని పచ్చర్లకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పార్టీలకు అతీతంగా పథకాలను అందిస్తామన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పచ్చర్ల కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణయ్య

మల్దకల్: మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై 12వ విడత సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎస్ఆర్‌పీ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 2022 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తనిఖీలకు వచ్చే అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. ఉపాధి హామీ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలను గుర్తించి, గ్రామసభల్లో వెల్లడించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఏపీఓ స్వామి తదితరులు ఉన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అయిజ: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని పలువురు వక్తలు సూచించారు. ఎంబీ ఉమెన్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని బ్రైట్ స్టార్ పాఠశాలలో బాలికల క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ చర్చీలకు చెందిన పాస్టర్లు బైబిల్ వాఖ్యలను చదివి వినిపించారు. ప్రజలందరూ సన్మార్గంలో పయనించాలని, పరులకు ఉపకారం చేసినప్పుడే దేవుడి కృప లభిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఎస్తేర్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

గట్టు: బడిబయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి అంపయ్య, ఎంఈఓ కొండారెడ్డి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం గట్టు, కేటీదొడ్డి మండలాల వలంటీర్లకు విద్యాబోధనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి, మెరుగైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. చదువు ప్రాముఖ్యతపై తల్లిదండ్రులపై అవగాహన కల్పించి, పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని వలంటీర్లకు సూచించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, రిసోర్స్‌పర్సన్ రాంబాబు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



ధరూరులో నిల్వ నీటిని పారబోస్తున్న వైద్యసిబ్బంది

గద్వాల రూరల్: పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని ఆరోగ్య పర్యవేక్షకుడు హీర్యానాయక్ అన్నారు. ధరూరులో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికెళ్లి నిల్వ నీటిని పారబోశారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా డ్రెయినేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్సింహులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంతోపాటు చెన్నిపాడు, అమరవాయి తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ఎంపీఓ ఆంజనేయరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

కోర్టు నిబంధనలు ధిక్కరించిన వ్యక్తికి జైలు

కొత్తకోట రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఆత్మకూర్ సివిల్ కోర్టు జడ్జి శిరీష జైలుశిక్ష విధించారు. కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల ప్రకారం.. 2014లో నాటవెల్లి ఎన్‌హెచ్44పై తమిళనాడు రాష్ట్రానికి చెందిన డ్రైవర్ షణ్ముగ లారీని అజాగ్రత్తగా నడుపుతూ బొలేరో వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఆత్మకూర్ మండలం జూరాల గ్రామానికి చెందిన ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పట్లో స్టేషన్ బెయిల్‌పై వచ్చిన లారీ డ్రైవర్ విచారణ నిమిత్తం కోర్టుకు హాజరు కాకపోవడంతో అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. గురువారం రాత్రి నల్గొండ జిల్లా భువనగిరి వద్ద షణ్ముగను అరెస్టు చేశారు. శుక్రవారం ఆత్మకూర్ కోర్టులో షణ్ముగను హాజరుపర్చగా జడ్జి శిరీష 14రోజులు రిమాండ్ విధించారు. నిందితుడిని మహబూబ్‌నగర్ జైలుకు పంపించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో..

అమరచింత: మద్యం తాగి వాహనం నడిపిన యువకుడిని పట్టుకుని కోర్టులో హాజరు పర్చగా ఆత్మకూర్ సివిల్‌కోర్టు జడ్జి శిరీష ఒక రోజు జైలు శిక్ష విధించారని ఎస్ఐ జగన్మోహన్ శుక్రవారం తెలిపారు. పట్టణానికి చెందిన శ్రీకాంత్ మద్యం తాగి ద్విచక్ర వాహనం నడపడంతో కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు. దీంతో జడ్జి ఒక రోజు పాటు జైలు శిక్ష విధించారని వెల్లడించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగుళాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com